నామకరణం

(1986)

"జాగ్రత్తమ్మా! నేనుంటా మరి. స్టేషన్‌కి బావగారొస్తారు. లేదా ఎవర్నైనా పంపుతారు–తొందరబడి ఏ రిక్షాయో ఎక్కేయకు–కాస్సేపు ప్లాట్‌ఫాం మీదే వుండు. ట్రైన్ దిగుతున్నపుడు జాగ్రత్త! అందరూ దిగేకే దిగు–అరగంట ఆగుతుందక్కడ

చక్రధరం చెప్పిన జాగ్రత్తలకు నవ్వుకుంది శివకామేశ్వరమ్మ.

"అలాగేలేరా–నాకిదేం కొత్తా ఏమన్నానా? వయసు పైనబడి దృష్టి మందగించిందనేగానీ స్టేషన్‌కి ఒకరు రావాలా? నాకు తెలియని ఊళ్ళా? తెలియని ఇళ్ళా–నువ్వుండు" అంది—

"ఆ సజ్జలో మీకోసం సున్నుండలూ, మామిడి తాండ్ర, పళ్ళు పెట్టేను–మర్చిపోకండత్తయ్యా" అంది సుమిత్ర.

"అలాగేలే–అయినా నా ఒక్కదానికీ ఎందుకివన్నీ"

"స్వరాజ్యంతోనూ పావనితోనూ ఉన్న విషయం చెప్పమ్మా–మరోలా అనుకోవద్దను–ఏ మాత్రం వీలున్నా గోపాలం మెడ్రాసు నుంచి వస్తాడు" అన్నాడు చక్రధరం.

"సరే–నే చెబుతాలే" అంది శివకామేశ్వరమ్మ.

గార్డు విజిల్ వేసేడు–రైలు కూతవేసి కదిలింది.

కొడుకు వంక, కోడలి వంక ఒక్కమారు చూసింది శివకామేశ్వరమ్మ.

"ఆ బారసాల అయ్యేక మీరూ మామయ్యగారూ యిక్కడికే వచ్చెయ్యండి." అంది సుమిత్ర ఏదో గుర్తొచ్చిన దానిలా. ఆ మాట అంటున్నపుడు ఆమె మనసులో వువ్వెత్తున లేచిన ఆప్యాయతను అర్ధం చేసుకుంది కామేశ్వరమ్మ.

"అలాగేలే" అన్నట్లు తలూపింది సమాధానంగా.

చక్రధరం చెయ్యి వూపేడు. అతని ముఖంలో దిగులు!

"పిచ్చితండ్రి. వీడెప్పుడూ పసివాడే" అనుకుంది. శివకామేశ్వరమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ముందుగా అనుకున్నదే అయినా ఈ ప్రయాణం ఎంతో హడావుడిగా అన్పించింది, కామేశ్వరమ్మకు-మనమరాలు పావనికి ఆడపిల్ల పుట్టిందని పదిరోజుల క్రితం స్వరాజ్యం నుండి శుభవార్త వచ్చింది-

"బారసాల మాయింట్లోనే. నువ్వు తప్పకుండా రావాలమ్మా" అంటూ రాసింది-

ఇప్పటిరోజులు వేరు-పద్ధతులు వేరు. ఇంకా యీ వేడుకలకి యీ ముసలమ్మ ఎందుకూ అనుకుందే గాని వెళ్ళాలని గట్టిగా అనుకోలేదు. కాని రెండురోజుల క్రితం పావని రాసిన ఉత్తరం చదివిన దగ్గర్నుండే వెళ్ళి తీరాలనే కాంక్ష మొదలయ్యింది-"నా కూతురి బారసాల మీ ఇద్దరి సమక్షంలోనూ జరగాలని అనుకుంటున్నానమ్మమ్మా. తాతయ్య ఎటూ వచ్చేరు. నువ్వు కూడా రావాలి. ఇది కోరిక అనుకుంటే మరో బాధ్యతను కూడా నీ కప్పగిస్తున్నాము-నీ మునుమరాలికి ఏం పేరు పెట్టాలో నువ్వు చెప్పాలి." అంటూ రాసింది-వీళ్ళందరికీ ఎందుకింత అభిమానం తనంటే? ఏదెలా వున్నా తను వెళ్ళడానికే నిశ్చయించుకుంది-పావని అభిమానంతో రాసింది. అది చాలు తనకు. రెండోది....ఆయనను వదిలి నాలుగు నెలలే అయినా నాలుగేళ్ళయినట్టు వుంది-పెళ్ళయిన యిన్నేళ్ళలో ఆయన నొదిలి వున్నది యీ నాలుగు నెలలే! వెధవది....కరువు రోజులొచ్చేసి తల్లి దండ్రులే బరువనిపించే రోజుల్లో ఒకరికే భార మవడ మెందుకని వెరవవలసి వచ్చింది గానీ లేకుంటేచివరి రోజుల్లో వేరు వేరుగా వుండేవారా?

"రెండు రోజులు ముందుగా వెళ్తే అది సంతోషిస్తుందిరా" అంది ఉత్తర మొచ్చిన మర్నాడు చక్రధరంతో.

"నిజమేనమ్మా. కానీ నాకు సెలవు దొరకాలిగదా" అన్నాడు.

మనసు, అభిమానాలూ ఉన్నా ఒక్కొక్కప్పుడు పరిస్థితులు అనుకూలించవు-స్వరాజ్య మంటే చక్రధరానికెంతో అభిమానం. పావని అక్షరాలా చక్రధరం గుండెల మీదే ఆడుకునేది. అటువంటిది ఏమాత్రం అవకాశమున్నా రాకుండా ఉంటాడా?

మొత్తానికి చక్రధరానికి సెలవు దొరక్క తనొక్కతే బయల్దేరక తప్పలేదు-లేకుంటే యింత-వయసొచ్చీ యింత బలగం ఏర్పడ్డాక ఒంటరిగా ప్రయాణం చేసే పరిస్థితి ఏర్పడుతుందా?

రైలు ముందుకు పోతుంటే శివకామేశ్వరమ్మ ఆలోచనలు గతంలోకి పరుగెత్తాయి.

తనంటే అందరికీ అభిమానమే-తన చేతుల మీదుగా ఎన్నో పెళ్ళిళ్ళూ శుభకార్యాలూ జరిగాయి-మరెన్నో బారసాలల్లో పాలు పంచుకుంది-ఆ మాటకొస్తే బారసాల అంటే తననే పేరు సూచించమనే వారంతా. తనకు కలిగిన సంతానంలో మగపిల్లలిద్దరికీ పేర్లు ఆయనే పెట్టేరు.

ఆడపిల్లకు మాత్రం పేరుపెట్టే బాధ్యతను తొలిసారిగా తనకప్పగించారు. అప్పట్లో తన తండ్రి రాజకీయాల్లో దేశ స్వరాజ్య సాధనకోసం తిరిగేవాడు - ఆ ఉద్యమానికెందరో ఎన్నోరకాలైన త్యాగాలు చేశారు. అప్పట్లో పుట్టడం వల్లనే దానికి స్వరాజ్యం అని పేరు పెట్టింది. స్వరాజ్యం ఎంతో అపురూపంగా స్వేచ్ఛగా పెరిగింది. చివరికి చదువు, పెళ్ళి విషయాలలో కూడా దాని యిష్టాని కెవరూ అడ్డు రాలేదు.

రైలు ముందుకు పోతూనే ఉంది. ఆలోచనల్లో మునిగి తేలిన శివకామేశ్వరమ్మకు ప్రయాణం అట్టే విసుగనిపించలేదు.

* * *

స్టేషన్‌కి అల్లుడు రాజేంద్ర ప్రసాద్ వచ్చాడు. "బావున్నారా అత్తయ్యా. ప్రయాణం బాగా జరిగిందా" అంటూ కుశలాన్ని ప్రశ్నించేడు-అన్నిటికీ సమాధానాలు చెప్పింది కామేశ్వరమ్మ.

జట్కా యింటి ముందాగేసరికి గేటు దగ్గరికి ఎదురొచ్చింది స్వరాజ్యం."బావున్నావా అమ్మా" అంటూ ఆమె చేతిలోని సామానందుకుంది.

మెట్లెక్కి అరుగు మీది కి వచ్చేసరికి పావని వచ్చి ఆనందంతో కౌగిలించుకుని, "అంత ముందుగా రాస్తే యిప్పుడా రావడం. నీతో మాట్లాడకూడదనుకున్నాను" అంది బుంగమూతితో-

"ఏం చేయనే! మీ మామయ్య కూడా వస్తానంటే ఆగేను-తీరా వాడికి సెలవివ్వలేదు వాడి ఆఫీసరు." అంటూ జవాబు చెప్పి.

"ఇంతకీ మీ తాతయ్యేరే" అనడిగింది.

"మొత్తానికి ఆడబుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదమ్మమ్మా" అంది పావని మూతి ముడుస్తూ.

"ఏవిఁటే....?"

"ఏవిఁటేవిఁటీ. ముందు నా కూతుర్ని చూసి ఎత్తుకుంటావనుకుంటే నువ్వేమో తాతయ్య నడుగుతున్నావ్" అంటూ నవ్వేసి,

"అదిగో....ఆ మూల పట్టె మంచంమీద మూల పురుషుడిలా. మీ మాటలు అయినాకే రా" అంది-

"పోవే గడుగ్గాయి. ఇంతకీ ఏం ఆయనేదే? ఇలాగే వేపుకు తింటున్నావా?"

"ఆహా! ఇంతకంటే ఎర్రగానే. బజార్లో కెళ్ళేరు. కావలిస్తే వచ్చేక చూడు–ఎంతెర్రబడ్డారో" నవ్వేసింది పావని.

"ఎలా వున్నారూ?" ఏ సంబోధనాలేని కామేశ్వరమ్మ ప్రశ్నకు మంచం మీది మూలపురుషుడు పండు మీసాలు మెలేసి.

"మహారాజులా వున్నాను–" అన్నారు.

"మరి కిరీటమేది తాతయ్యా?" ఠక్కున అందుకుంది పావని.

"పెళ్ళికాక ముందు వరకూ ఉండేదే–ఆ తర్వాత దాని స్థానాన్ని మీ అమ్మమ్మ ఆక్రమించింది. అంచేత యీ నాలుగు నెలలూ మకుటం లేని మహారాజులా వెలిగాను. మళ్ళీ వచ్చేసిందిగా"

నవ్వులతో ఇల్లు గొల్లుమంది.

"బావున్నారా అమ్మగారూ" పరిచయమున్న గొంతులా అన్పించి అటు తిరిగి చూసింది కామేశ్వరమ్మ.

"ఎవరూ....సీతాలా....బాగున్నావటే?" అడిగింది–

"మీదయవల్ల బాగానే ఉన్నానండమ్మగారూ"

"ఎక్కడుంటున్నారూ....మీ ఆయనెలా ఉన్నాడూ"

"బాగానే ఉన్నాడమ్మగారూ. బేంకీలో అప్పు దీసుకుని చిన్న కిల్లీకొట్టెట్టేడు–మారాణీ పేటలో ఉంటున్నాం అంతా మీ చలవ" అంది,

"మాదేముందే....ఆశివుడిలీల. ఇంతకీ పిల్లలా"

"ఒకాడపిల్ల–మీపేరే పెట్టుకున్నాం"

కామేశ్వరమ్మ కళ్ళు ఆనందంతో తడిశాయి.

"లెగండమ్మగారూ. బాత్రూంలో ఏన్నీళ్ళెట్టేను. తానం చెయ్యండి. ఆ తర్వాత తీరిగ్గా మాటాడుకోవచ్చు" సీతాలు మాటలకు లేచింది కామేశ్వరమ్మ. స్నానం చేసి వచ్చేసరికి ఫలహారమూ

కాఫీ సిద్ధం చేసింది స్వరాజ్యం. కాసింత తిని, కాఫీ తాగి మేడ మీద సన్నజాజి పందిరి క్రింద కేను కుర్చీలో కూలబడింది.

అప్పటికి సాయంకాలపు వెలుగు పూర్తిగా తగ్గిపోయింది. చల్లని గాలి, దూరంగా కంటికందంగా కన్పించే దీపాల తోరణాలు, కామేశ్వరమ్మ మనసులో ఎన్నెన్నో తీపి జ్ఞాపకాలను రేపేయి,

జీవితం క్షణభంగురమని తెలిసినా బాంధవ్యాల వుచ్చుల్లో పడి, సంసార తాపత్రయంలో నలిగి, వంశాన్నీ, కుటుంబాన్నీ పెంచి మమతాను రాగాల్ని వారి చుట్టూ అల్లుకుని, సమస్యల సాలెగూళ్ళలోంచి బయటపడుతూ తొలి సందెలోని వెలుగుకూ మలిసందెలోని మలయ మారుతానికీ పులకించి పోతూ రేపటి కోసం ఆశగా ఎదురు చూస్తూ మనిషి ఏం సాధిస్తున్నాడు? చివరికి ఏం మిగుల్చుకుంటున్నాడు?

ఇదిగో....యిటువంటి కాసింత సంతృప్తే. బాంధవ్యంలోంచి జనించిన ఒకింత అనురాగం, ఆప్యాయత-అంతే! అంతకు మించి ఏం కావాలి?

డాబా పిట్టగోడ మీంచి క్రిందికి చూసింది కామేశ్వరమ్మ. పావని భర్త రాజశేఖరం వచ్చినట్టున్నాడు.

"మా అమ్మమ్మ వచ్చిందండోయ్. మీ గురించి అడిగింది కూడ" అంటోంది పావని.

"సర్లే" అని గొంతు తగ్గించి, "ఇంతకీ నీ కూతురికి ఏం పేరు పెట్టమంది? సరిగ్గా రేపాసమయానికి ఏ సావిత్రో అనసూయో పెట్టమంటే—గోవిందా...."

అతని మాటలకు కామేశ్వరమ్మ మనసు చివుక్కుమంది.

"అవునుమరి! పావని కున్న అభిమానం అతనికెందుకుంటుందీ? అయినా తను పాత తరం మనిషే. తన అభిరుచులు యీ కాలం వారికి నచ్చక పోడంలో ఆశ్చర్యం లేదు" అనుకుని సరిపెట్టుకుంది.

ఆ మాటకొస్తే గోపాలంకి తను పెట్టిన పేరు కోడలికి నచ్చిందా? ఇప్పుడిప్పుడు వాడు ప్రయోజకుడయ్యాక ఆమెకు తనపై గురి కుదిరింది.

నిట్టూర్చింది కామేశ్వరమ్మ.

"ఏమే బామ్మా. ఈ చీకట్లో కూర్చుని ఏం చేస్తున్నావే. బాగున్నావా" అంటూ డాబా మీది కొచ్చాడు గోపాలం.

"నీ గురించే అనుకుంటున్నానురా బాబూ. ఎప్పుడొచ్చావ్?"

"ఇప్పుడే వచ్చేనే. నువ్వొచ్చేవని తెల్సి ఇల్లంతా వెతికి యిక్కడికొచ్చాను" అంటూ ఆమె కాళ్ళదగ్గర చతికిలబడ్డాడు.

"నిక్షేపంలా వున్నాన్రా. మీరంతా వుండగా నాకేం లోటూ. ఇంతకీ నీకెలా వుందక్కడ? మంచి భోజనం దొరుకుతోందా లేక ఆ సాంబారు నీళ్ళేనా" అడిగింది మనవడి తల నిమురుతూ.

"ఫర్వాలేదే. ఎటొచ్చీ ఏ చింతకాయ పచ్చడో, గోంగూర పచ్చడో గుర్తుకొచ్చినప్పుడు మాత్రం నాలిక లాగేస్తుంది. ఆ వెంటనే నీ దగ్గరకు పరుగెత్తుకొచ్చేసి నీ చేతివంట తినాలనిపిస్తుంది"

"నా పిచ్చి నాయనే" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది కామేశ్వరమ్మ.

"ఈమారు నిన్ను నాతో మెడ్రాస్ తీసుకెళ్ళిపోడానికే నిశ్చయించుకున్నాన్లే. వంటకోసం కాదు సుమా. ఎంచక్కా ఓ వంటమనిషిని పెడతాను."

"పెళ్ళి చేసుకుంటే అన్ని సమస్యలూ తీరిపోతాయిరా పిచ్చి సన్నాసీ. మీ నాన్నతో చెప్పి మంచి సంబంధం చూడమంటాను. ఎంచక్కా మీరిద్దరూ చిలకా గోరింకల్లా వుంటే అప్పుడొచ్చి నేనూ మీ తాతయ్యా నీ దగ్గరే వుంటాం నువ్వు పొమ్మనే వరకూ."

* * *

భోజనమయ్యాక భర్తతో నాలుగు ముక్కలు మాట్లాడి ముందు వాకిట్లో మల్లెమొక్క ప్రక్కన వాల్చివున్న మంచంమీద చతికిల బడింది కామేశ్వరమ్మ. వెన్నెల పల్చగా వుంది. ఆ లేత వెన్నెల్లో రంగు రంగుల క్రోటన్ మొక్కలు వింత అందంతో మెరుస్తున్నాయి.

ఆ సమయంలో పావని భర్త రాజశేఖరం బయటకొచ్చాడు.

"నాయనా రాజశేఖరం" పిలిచింది– "ఏవిఁటి మామ్మగారూ" అంటూ వచ్చి ఆమెకెదురుగా కూర్చున్నాడు.

"చూడు నాయనా, పావని నామీదో పెద్ద భారాన్ని వేసింది. దానికి నేనంటే పిచ్చి అభిమానం. పాత తరానికి చెందిన మా అభిరుచులు వేరు. ఈ తరంవారైన మీ అభిరుచులు వేరు– పెద్దవాళ్ళున్నా ఎవరి పెళ్ళిళ్ళు వాళ్ళే పెద్దలై చేసుకుంటున్న యీ రోజుల్లో మీ అమ్మాయికి పేరు నేను పెట్టడం ఏం బాగు చెప్పు? ఇప్పటి ఫేషన్ రోజులకు అనువైన పేరేదో మీ యిద్దరే ఆలోచించి పెట్టుకుంటే బావుంటుందని నా అభిప్రాయం– అది నా మాట వినటం లేదు. నువ్వే నచ్చజెప్పాలి" అంది. కామేశ్వరమ్మ– ఆ మాటలకు రాజశేఖరం ఆశ్చర్యపోయేడు.

"అదేంటి మామ్మగారూ యీ కుటుంబంలో చాలమందికి మీరే నామకరణం చేశారటగా. పావనికి మీమీద గురి. మీరే ఏదో వూహించి చెప్పండి. అంతగా నచ్చకపోతే అప్పుడే ఆలోచిద్దాం. మీరు సూచించిన పేరు మాకు నచ్చుతుందనే నమ్మకం నాకుంది" అన్నాడు.

"ఎందుకైనా మంచిది మీరు కూడ ఆలోచించండి నాయనా" అంది.

"అలాగేలెండి" అంటూ లేచాడతను.

"ఆ తర్వాత గోపాలం వచ్చి మద్రాసు కబుర్లు చెప్పడం మొదలు పెట్టేడు- 'అమ్మమ్మని ఈ రాత్రి పడుకోనివ్వవా ఏంటి' అని పావని అనే వరకూ గోపాలం ఆపలేదు'

గదిలో పక్క వేసింది స్వరాజ్యం. మంచంమీద పడుకున్న దన్న మాటేగాని కామేశ్వరమ్మకి నిద్రపట్టలేదు. ఆమె ఆలోచనలు ఎక్కడెక్కడో పరుగులు తీస్తున్నాయి.

వీధి గుమ్మం సీతాలు చేత కడిగించి తనే స్వయంగా ముగ్గు తేస్తోంది స్వరాజ్యం- గోపాలం అప్పుడే నిద్రపోయాడు.

తెల్లారితే బాలసార!

కామేశ్వరమ్మ ఆలోచనలు ఇరవై రెండేళ్ళ వెనక్కి పోయాయి

ఆరోజింకా జ్ఞాపకమే. తెల్లారితే చక్రధరం కొడుకు బాలసార. చుట్టాలతో యిల్లు కలకల్లాడిపోతోంది. ఆ రోజంతా తను వంటింటికే అంకితమైపోయింది. తనకు సాయంగా పెంటమ్మ.

పెంటమ్మకప్పుడు తొమ్మిదేళ్ళు. డబ్బుకోసం పనిచేసే పని పిల్లే అయినా అది అలా వుండేది కాదు- శుభ్రంగా తల దువ్వుకుని ఉతికిన గౌను వేసుకుని మరీ పన్లోకొచ్చేది. రెండు రోజులైై అది తమ యింట్లోనే వుండిపోయింది. ఎవరికే అవసరమొచ్చినా దానినే పిలిచేవారు.

ఆ రాత్రి.... భోజనాలయ్యాక దేవుడి గదిలోకొచ్చి కూర్చుంది తను- మనవడికి పెట్టబోయే పేరుకోసం ఆలోచిస్తోంది. చివరికి రెండు పేర్లు స్ఫురించాయి. ఒకటి శివుడి పేరు. రెండోది కృష్ణుడి పేరు. శివుడంటే తనకిష్టమే. అటు శివుడినీ యిటు రాముడినీ కలిపి 'శివరామ్' గా మార్చి ఆయన రెండోవాడికి పెట్టారు. పోతే కృష్ణుడన్నా తన కిష్టమే. చిన్నప్పుడు కృష్ణుడి పాటలు రాసుకుని పాడేది తను. ప్రతి

కృష్ణాష్టమికీ తమ యింట్లో వుండే పెద్దకృష్ణుడి బొమ్మకు రంగువేసి అలంకరించేది. అంచేత ఆ కృష్ణుడి పేరే మనవడికి పెట్టాలనే నిర్ణయానికొచ్చింది.

సరిగ్గా అదే సమయంలో ఆ గదిలోకి వచ్చి తలుపు దగ్గర నించుంది పెంటమ్మ.

"పనులన్నీ అయిపోయాయిగా, పోయి పడుకో" అంది దాని వంక చూసి. పెంటమ్మ కదలలేదు. తలొంచుకుని అలాగే నిలబడి పోయింది

"ఏమిటే? ఏంకావాలి" అడిగింది తనే-

అది వెంటనే ఏమీ మాట్లాడలేదు. కానీ దాని మనసులో ఏదో అడగాలనే ఆరాటపడుతున్నట్లు అర్థమైంది. మళ్ళీ రెట్టించి అడిగేసరికి- నెమ్మదిగా గొంతు విప్పింది—

"రేపుబాబుకి పేరెడతన్నారు గదమ్మా" అంది-

"అవునే— తెలియనట్టు కొత్తగా అడుగుతున్నావేం?"

ఈమారు కాస్తనసిగి, మరి నాక్కూడ ఓ పేరెట్టండమ్మగారూ" అంది- దాని మాటలకు ఆశ్చర్యపోయింది తను.

"అదేంటే— నీకో పేరుందిగా— మీ అమ్మా నాన్నా పెట్టిందీ"

"అది నాకొద్దమ్మగారూ. మీరే మరో మంచి పేరెట్టండి" అంది.

పెంటమ్మకి తల్లీతండ్రీ యిద్దరూ లేరు. పెంటమ్మ తల్లికి వరుసగా యిద్దరు పిల్లలు పుట్టి పురిట్లోనే పోతే మూడో పిల్లని పుట్టిన వెంటనే పెంటమీదవేసి దానికి 'పెంటమ్మ' అని పేరు పెట్టారట. పెంటమ్మ బతికింది. దాని తల్లీతండ్రీ యిద్దరూ రెండేళ్ళ తేడాతోపోతే తాత దగ్గర పెరుగుతోంది.

అందరూ దాన్ని పెంటా అంటారు- కోపమొస్తే ఒసేపెంటచ్చి

అనీ పిలుస్తారు. తనుమాత్రం పెంటమ్మా అంటుంది. కానీ ఎవరెలా పిలిచినా పలుకుతుంది పాపం! ఆ పేరు దానికెంత యిష్టంలేదో-సమయ మొచ్చింది కాబట్టి తన అభిప్రాయాన్ని బయటపెట్టింది.

చిన్నకోరిక అయినా ఎంత విచిత్రమైన కోరిక అది!

నచ్చని పేరును మార్చుకోవాలనే కోర్కె చాలమందికి వుంటుంది. తక్కువ కులంలో పుట్టి పెద్ద పెద్ద సినిమాస్టార్లయిన వాళ్ళు చాలామంది తమ తమ పేర్లను అందంగా మార్చుకున్నారట. ఆ సంగతీ అదే చెప్పిందోసారి.

ఏమైనాసరే దాని కోరిక తీర్చాలనే అన్పించింది. ఆ రాత్రే ఒక నిర్ణయానికొచ్చి సంతృప్తిగా నిద్రపోయింది తను.

మర్నాడు ఉదయం భర్తతో చెప్పి దానికో కొత్త గౌను తెప్పించింది. అందరితోపాటు దాన్నీ తలంటు పోసుకోమంది. కొత్త గౌను వేసుకోమంది. తర్వాత పిల్చి చెవిలో తన అభిప్రాయం చెప్పింది. అంతే! దాని ముఖం ఆనందంతో విప్పారింది- తలూపి అంగీకారాన్ని తెలియజేసింది.

నామకరణ సుముహూర్తానికి బంధువులూ స్నేహితులూ అంతా వచ్చారు- మనవడికి తను సూచించిన రెండు పేర్లలోనూ బాలగోపాలం అనే పేరే చక్రధరానికీ నచ్చింది. ఆ పేరే ఖాయం చేసేడు. అటు మనవడికి నామకరణం జరిగిన మరుక్షణంలోనే తను పెంటమ్మను దగ్గరకు పిల్చి" ఈ రోజునుండీ దీని పేరు సీతాలు, పెంటమ్మకాదు- మీరంతాకూడ అలాగే పిలవాలి" అంటూ అందరి సమక్షంలో దానికి నామకరణం చేసింది. అలా ఆనాటి నుండీ పెంటమ్మ సీతాలు అయింది ఆ పేరు దానికి బాగా నచ్చిందని తెల్సి ఎంతో సంతోషించింది-

అయితే ఆ సంతోషం ఎంతో కాలం నిలవలేదు. దానికి తనా

పేరు ఎందుకు పెట్టానా అని పశ్చాత్తాపపడవలసిన రోజు కూడ వచ్చింది.

అనుకోకుండా పావని పెళ్ళిలోనే దానిపెళ్ళీ కుదిరింది. రాజశేఖరం దగ్గర పనిచేసే రామయ్య సీతాల్ని చూసి మనసుపడ్డాడు. మనువాడాలనుకున్నాడు. ఏ కట్నకానుకలూ తీసుకోకుండానే పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళి తామే దగ్గరుండి జరిపించారు.

ఆ కృతజ్ఞత దానికిప్పటికీ వుంది. దానికి తను దేవతతో సమానం.

అయితే సీతాలు కాపురం అనుకున్నంత సజావుగా సాగిపోలేదు ఎందుకు కలిగిందో నిప్పులాంటి సీతాలు మీద దాని మొగుడికి అనుమానం కలిగింది. క్రమంగా తాగుడికి లోనై సీతాల్ని ఏలుకోనని పంపించేశాడు.

అలా సీతాలు మళ్ళీ వచ్చేసింది. జరిగిందానికి తనూ ఎంతో బాధపడింది.

"మీరేం చేత్తారమ్మగోరూ. నాకాడితో కాపరంజేసే గీతే లేదేటో- అయినా నాకేటి? ఇలా మీ యింట పన్జేసుకుంటే నా కడుపు నిండిపోద్ది. నా జీవితం ఎళ్ళిపోద్ది. అయితే నా కడుపు పండి ఒక్క నలుసైనా పుడితే ఆ బిడ్డని చూసుకుంటూ వుండిపోయేదాన్ని. ఆ రాత నాకు లేదు" అని బాధపడింది సీతాలు. సీతాలనే పేరు పెట్టడంవల్లనే దానికా కష్టాలొచ్చాయేమో అన్పించేది. ఆ మాటే దానితో అంటే.

"సీతమ్మవారి పేరుకేటమ్మా. మాలచ్మి పవిత్రమైంది. నారాత యిలా తగలడితే పేరేం జేసింది? ఈడికెవరో కిట్టనివాళ్ళు నూరిపోసేరు. నిజం నిలకడమీద తెలవకపోదు" అంది.

అర్ధరాత్రి పన్నెండు- అంతా నిశ్శబ్దంగా వుంది. కామేశ్వరమ్మ మస్తిష్కంలో జ్ఞాపకాలు సుళ్ళు తిరుతూనే వున్నాయ్.

మనవడికి బాలగోపాలం అని పేరు పెట్టి తను తప్పే చేసిందా అనుకుంది చాలామారు. కొడుక్కి ఆ పేరు వచ్చినా కోడలికి నచ్చలే దన్న సంగతి క్రమంగా అర్థమైంది.

"అత్తగారు ఎంచెంచి ఆ పేరు పెట్టినందుకు వాడికా బుద్ధులే వచ్చేయి" అనేది. దానికి తగ్గట్టూ గోపాలం ప్రవర్తన కూడ అలాగే వుండేది. చదువుమీద శ్రద్ధ చూపేవాడు కాదు. ఎంతసేపూ స్నేహితులూ షికార్లూను. కాస్త వయసొచ్చాక ఆడపిల్లల స్నేహాలు కూడ. ఎర్రగా బుర్రగా వుండేవాడేమో అమ్మాయిలంతా వాడి చుట్టూనే వుండేవారు. దానికితోడు గోపాలం పాటలు పాడేవాడు. లలితగీతాలూ, సినిమా పాటలూ నాటకాలూ పద్యాలూ ఒకటేమిటి ఎవరెక్కడ ఏది పాడమన్నా బిడియపడకుండా నిర్భయంగా గొంతెత్తి పాడేవాడు.

ఏ మాటకామాటే అనుకోవాలి. వాడి గొంతులో ఏదో ఆకర్షణ వుండేది. అదే వాడిని ఉచ్ఛస్థితిలోకి తీసుకువెళతుందనిపించేది. కానీ యింటర్ మొదటి సంవత్సరం తప్పడంతో అందరికీ వాడి భవిష్యత్తు మీద అపనమ్మకం ఏర్పడిపోయింది.

దీర్ఘంగా నిట్టూర్చింది కామేశ్వరమ్మ.

పేరుబలం కొంత మనిషిని నడిపించకపోదు! తనమీద నమ్మకం వుంచుకొన్నవారికి తనేం అన్యాయం చెయ్యలేదు. వాళ్ళ వాళ్ళ అదృష్టాలు తనని కూడ గొప్పదాన్ని చేశాయి

లేకుంటే— మరి చక్కబడదనుకున్న సీతాలి సంసారం చక్కబడేదేనా?

ఎందుకూ పనికిరాడనుకొన్న గోపాలం ఇలా గొప్పవాడయ్యేవాడా? అందుకే యిప్పటికీ తనపై అందరికీ గురి!

సీతాలు ఆశపడ్డట్టుగానే దాని జీవితంలోకి మంచిరోజు

లొచ్చాయి. కట్నం తేలేదన్న కచ్చకొద్దీ రామయ్య మేనమామే యీ అనుమాన విషబీజాన్ని అతని బుర్రలో నాటి మరో పెళ్ళిచేసి కట్నం లాగాలనుకున్నాడు. కానీ నిజం బయటపడింది. రామయ్య పశ్చాత్తాపపడి సీతాల్ని మళ్ళీ తన జీవితంలోకి ఆహ్వానించాడు. బ్రతుకును చక్కదిద్దుకున్నాడు.

ఆ జంటకిప్పుడో పాప- ఆ పాపకి తన పేరేనట!

సరైన సంగీత జ్ఞానం లేకుండా అల్లాటప్పాగా పాటలు పాడే గోపాలం ఒక్కమారు సినీగాయకుడై పోతాడని ఎవరనుకుంటారు? ఒక పెద్ద సభలో గోపాలం పాడిన పాట విని వాడి కంఠంలోని మాధుర్యాన్ని గుర్తించి వాడిని తన సినిమాలో పాడమని అడిగాడొక సినీ నిర్మాత. అంతే! ఆలంబన దొరికి గోపాలంలోని కళ విజృంభించింది. సంపాదనకు సంపాదన. కీర్తికి కీర్తి రెండూ లభించాయి వాడికి.

చిన్నప్పుడు పిల్లనగ్రోవి వూదుతూ అల్లరి చిల్లరగా తిరిగిన బాలకృష్ణుడే పెద్దయ్యాక మంచి వ్యవహర్త అవలేదా? గీతాజ్ఞానామృతాన్ని పంచలేదా? ఆ విషయాన్ని కాస్త ఆలస్యంగా గ్రహించిన కోడలు తనని కొత్తగా గౌరవించడం చూస్తే నవ్వొస్తుంది.

శివకామేశ్వరమ్మ ఆ ఆలోచల్ని అంతటితో ఆపి, మనవరాలి కూతురికి పెట్టే పేరు కోసం ఆలోచించసాగింది. అది తనకు మాత్రం నచ్చితే చాలదు, అందరూ మెచ్చాలి. ముఖ్యంగా రాజశేఖరానికి నచ్చాలి! అంతకుముందు అనుకున్న నాలుగైదు పేర్లలోంచి ఒకటి ఎంచి నిశ్చయంచేసి, సంతృప్తిగా నిద్రపోయింది.

* * *

"సత్పురుష సభా మధ్యే....వ్యవహారార్థం మమకుమార్యాః

ఆయుష్యాభి వృద్ధ్యర్థం....మాసనామ్నా...." అంటూ పురోహితుడు చెబుతుంటే వెండి పళ్ళెంలో బియ్యం సర్ది భర్తకందించింది

పావని. అక్కడ చేరినవారంతా ఆ పాపకు పెట్టబోయే పేరు ఏమై వుంటుందా అని అత్యంత ఆసక్తితో చూస్తున్నారు. రాజశేఖరం అందరి వంకా చూసి, ముగింపు చెప్పబోయే సస్పెన్స్ రచయితలా కూతురి పేరును ఒక్కొక్క అక్షరమే ఉచ్చరిస్తూ ఆ పళ్లెంలో వేలితో రాశాడు.

"క.... రు.... ణ"

చెంగల్రావు పేట చాంతాడంత పేరేదో ఆ ముసలావిడ పెడుతుందనుకునే వారంతా ఆశ్చర్యపోయారు. కార్యక్రమం ముగిశాక రాజశేఖరం చెప్పాడు.

"చాలమందికి ఆశ్చర్యమే కలగొచ్చు. ఆ మాటకొస్తే యీ ఉదయం ఆవిడ నాకా పేరును చెప్పినప్పుడు మొదట నేనే ఆశ్చర్యపోయాను. నిజానికి 'కరుణ' చాల మంచి పేరు. నాగరికత పెరుగుతూ మనిషికీ మనిషికీ మధ్య అడ్డుగోడలు నిరంతరంగా ఏర్పడుతూ హింస, దౌర్జన్యం, దోపిడి, క్రౌర్యం, కక్ష దినదినం పెరిగిపోతున్న ఈ రోజుల్లో ప్రాణులన్నిటికీ గొప్పవాడైన మానవుడు తోటి ప్రాణుల ఎడల సహజంగా చూపాల్సిన కరుణ, జాలి చూపించకుండా పోతున్నప్పుడు వాటిని గుర్తు చెయ్యాల్సిన బాధ్యత మనకు వుంది. ఆ పదాన్ని వుచ్చరించడం ద్వారా అది కొంత సాధ్యపడుతుంది. అలా కాకపోయినా పేరుకుతగ్గ కరుణ స్వభావంతో నా కూతురు పెరగడమే నేను కోరుకొనేది!" అన్నాడు రాజశేఖరం. అందరిలోనూ ఆలోచన మొలకెత్తింది!

"బావుంది. మరి ఈ శుభసమయంలో సినీగాయకుడైన బాలగోపాలం ఓ పాట పాడాలి" అన్నారెవరో.

"అవునోయ్! 'కరుస్త్రానోయ్....చచ్చినాడా' లాంటివి కాకుండా ఓ మంచి పాట పాడు" అన్నాడు రాజేంద్రప్రసాద్ నవ్వుతూ.

బాలగోపాలం లేచి, గళం విప్పేడు.

"పాడరాదా పాట....పదిలముగ నీ నోట....
పాట వరమని మురిసి....పాట సుధయని తలచి
హిమగిరులు సుమవనులు....విమలకేదారములు
వినువీధి తారకలు....విని వినీ మురవంగ...."

పాట విని అంతా ముగ్ధులయ్యారు.

"ఒరేయ్ గోపాలం...,ఆ పాట రాసిందెవరో తెలుసునట్రా" అడిగేడు తాతయ్య.

"తెలీదు తాతయ్యా, చిన్నప్పుడెప్పుడో బామ్మ నేర్పించింది. ఆ పాటతోనే నేను సినిమాల్లోకి వెళ్ళాను.ఆ పాటంటే నాకెంతో యిష్టం" అన్నాడు.

"ఆ పాట రాసిందెవరో కాదురా. మీ బామ్మే" అన్నాడు తాతయ్య తాపీగా.

ఈ మారందరూ ఆశ్చర్యంతో శివకామేశ్వరమ్మ వంక చూశారు.

"నిజమేనా బామ్మా" ఒక్క గంతులో బామ్మ దగ్గరకు వెళ్ళేడు గోపాలం.

ఆమె కళ్ళలో అతనూహించినంత ఆనందంలేదు. ఆ స్థానంలో సంతృప్తి, వాత్సల్యం. ప్రేమ, అభిమానం!

"చెప్పు బామ్మా....అదే నిజమైతే ఓ మంచి సినిమాలో పాడు కుంటాను. మా బామ్మ పేరును వెండితెరమీద మెరిపిస్తాను" అన్నాడు.

నిజమేనన్నట్లు చిన్నగా తలాడించి, గోపాలం తలను ప్రేమతో నిమురుతూ "నేను పేరు పెట్టిన నా మనవలు నాకూ నా వంశానికీ పేరు తెచ్చేవాళ్ళయ్యారు. అది చాలు నాకు" అనుకుంది కామేశ్వ రమ్మ. అప్పుడామె కళ్ళు సంతృప్తిగా మెరిశాయి!!